క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. లక్ష విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన కాటూరి వివేకానంద శనివారం రూ. 1,00,016 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీపీ

జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరంలో ఉపాధి హామీ పథకం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ గెల్లా వెంకట రమణ, ఎంపీపీ కొదమ జ్యోతి మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉప సర్పంచ్ నిమ్మ రామకృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి అశోక్ కుమార్, వైఎస్సార్ సీపీ నేతలు దల్లి నాగేశ్వరరావు, మల్లెల్లి రామకృష్ణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతో ప్రశాంతత




రోగులకు పండ్లు, బ్రెడ్ అందిస్తున్న దృశ్యం

చింతలపూడి : ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త పద్మ విభూషణ్ శ్రీ రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకలను ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఆయన శిష్యులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంచిపెట్టారు. యోగా, ధ్యానంతో ప్రశాంత చేకూరుతుందని రవిశంకర్ గురూజీ తెలియజెప్పారని పలువురు కొనియాడారు. జె సూరారెడ్డి, చిక్కాల సుధాకర్, చిల్లపల్లి మోహన్‌రావు, గోలి చంద్రశేఖర్‌రెడ్డి, దా సత్యన్నారాయణ, ఎ.రాజారావు పాల్గొన్నారు.

విషప్రయోగంతో చేపలు మృతి

జంగారెడ్డిగూడెం: స్థానిక అక్కమ కోనేరు చెరువులో విషప్రయోగం కారణంగా చేపలు మృతి చెందాయి. రజక సంఘం పట్టణ అధ్యక్షుడు వడిగల శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనేటి చెరువును 60 ఏళ్లుగా రజకులు వృత్తితో పాటు చేపలసాగుకు వినియోగిస్తున్నారు. ఈ చెరువులో మూడు నెలల క్రితం రూ.3 లక్షలు విలువైన చేప పిల్లలను వేశారు. శనివారం ఉదయం చెరువులో చేపలు తేలిపోయి కనిపించాయి. చెరువలో విషప్రయోగం జరిగినట్టు గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై ఎం.సాగర్‌బాబు కేసు దర్యాప్తు చేపట్టారు. చెరువును పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ పశువులు, మూగజీవాలు చెరువు వద్ద నీటిని తాగకుండా గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. చెరువు నీటిని బయటకు తోడిస్తామని తెలిపారు.

ఎంపీ పరామర్శ



నాగేశ్వరమ్మకు నివాళులర్పిస్తున్న ఎంపీ శ్రీధర్, వైఎస్సార్ సీపీ నేతలు

లింగపాలెం : ధర్మాజీగూడెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేకల రాజు కుటుంబ సభ్యులను శనివారం ఎంపీ కోటగిరి శ్రీధర్, పార్టీ నేతలు పరామర్శించారు. మేకల రాజు మాతృమూర్తి నాగేశ్వరమ్మ ఇటీవల మృతి చెందారు. నాగేశ్వరమ్మ చిత్రపటానికి ఎంపీ, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీ మేకలరాజు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం గత కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన శింగగూడెం గ్రామానికి చెందిన పార్టీ నేత శావా రాజేష్‌ను ఎంపీ కోటగిరి శ్రీధర్, నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు, లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొఠారి మోహనరావు, మోరంపూడి జగన్, ఇనుగంటి సతీష్, ఏపూరి సూరిబాబు, ఓబిళ్లనేని ప్రభాకరరావు, కోటగిరి హరీష్, ధీరాజ్ కృష్ణ, బాబురావు, బి.పుల్లయ్య తదితరులు ఉన్నారు.

ఢీకొన్న రెండు లారీలు

లింగపాలెం : ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్న ఘటన శనివారం ధర్మాజీగూడెంలో చోటుచేసుకుంది. చేపల లోడుతో తెలంగాణా వెళుతున్న లారీ ఏలూరు వైపు వెళుతున్న మరో లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు లారీలకు చెందిన డ్రైవర్లకు, క్లీనర్‌లకు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

ప్రజల వద్దకే సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- మైసన్నగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం



మైసన్నగూడెంలో వర్జీనియా పొగాకు రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్ : ప్రజల వద్దకే సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని మైసన్నగూడెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వర్జీనియా పొగాకు రైతులతో మాట్లాడుతూ ధర ఎలా పడుతుంది, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకున్నారని, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ వచ్చారన్నారు. పేదలకు నవరత్నాల పథకాలు ఎంతో చేదోడుగా నిలిచాయని ఎమ్మెల్యే అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడంతో పాటు విద్య, వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందక అనేక ఇబ్బందులు పడ్డారని, గృహాలు కూడా మంజూరు చేయలేని పరిస్థితిలో పాలన చేశారన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించడంతో పాటు, సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అనేక మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రజల వద్దకే సంక్షేమ పాలనను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. సచివాలయాలు, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎలీజా కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ సింగుదాసు హైమావతి, ఉప సర్పంచ్ పిల్లి రామకృష్ణ, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, వైఎస్సార్ సీపీ నాయకులు గంజి వినోద్, జుజ్జూరి సత్యనారాయణ, వల్లూరి శ్రీకాంత్, టి. గంగరాజు, పితానీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దొరమామిడి రోడ్డుకు మరమ్మతులు



బుట్టాయగూడెం నుంచి దొరమామిడి వెళ్లే రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం నుంచి దొరమామిడి వరకూ రోడ్డుకు ప్రత్యేక మరమ్మతులు నిర్వహించారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఇటీవల పనులు ప్రారంభించగా అనివార్య కారణాల వల్ల నిలిచిపోయాయి. అయితే ఎమ్మెల్యే బాలరాజు చొరవతో రోడ్డుకు ప్రత్యేక మరమ్మతులు చేయించారు. దొరమామిడిలో జరుగుతున్న జాతరకు గ్రామానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా ఈ పనులు నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 154 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌ను ఉద్దేశించి మాట్లాడుతున్న జూనియర్ సివిల్‌జడ్జి పి.మధుబాబు

చింతలపూడి : చింతలపూడి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 154 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. వాటిలో క్రిమినల్ కేసులు 30, ప్రోనోట్ కేసు 1, చెక్‌బౌన్స్ కేసు 1, అలాగే న్యూసెన్స్ కేసులు 114, బ్యాంకు పీఎల్‌సీ కేసులు 6, టెలీఫోన్ బకాయి కేసులు 2 రాజీ చేసినట్లు చెప్పారు. ప్రోనోట్ కేసులో రూ. 85వేలు, న్యూసెన్స్ కేసుల్లో జరిమానా కింద రూ. 3,63,960 జరిమానా వసూలు చేసినట్లు చెప్పారు. బ్యాంకు పీఎల్‌సీ కేసుల్లో రూ.2,68,500, టెలీఫోన్ బకాయి కేసుల్లో రూ,.3,230 వసూలుచేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు పి.మధుబాబు, కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ఉద్దేశం రాజీ మార్గం అని, కోర్టుల్లో జరిగే లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుని చిన్న చిన్న తగాదాల విషయంలో రాజీపడి గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.డేవిడ్‌రాజు, నరుకుళ్ల సత్యనారాయణ, సోషల్ వర్కర్ అక్బర్ ఆలీ, సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు, పోలీసు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు చేయూతనిద్దాం



సమావేశమైన వర్జీనియా పొగాకు రైతులు

కొయ్యలగూడెం : తుపాను బాధిత రైతులకు చేయూతను అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎస్ఎల్ఎస్ పరిధిలోని వర్జినియ పొగాకు రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. శనివారం కొయ్యలగూడెం వర్జినియా పొగాకు వేలం కేంద్రంలో రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది ఆధ్వర్యంలో ఐదు వేలం కేంద్రాల రైతు సదస్సు నిర్వహించారు. ఇటీవల తుపాను ప్రభావం వల్ల వడగళ్ల వాన సంభవించడంతో రైతులు నష్టపోయారన్నారు. ఈ నేపథ్యంలో వారిని ఆదుకునేందుకు విరాళాలు సేకరిస్తున్నామన్నారు. ఎవరైనా స్వచ్ఛందంగా బేరన్‌కి వచ్చి రూ.200 విరాళంగా అందించాలని ఇలా వచ్చిన మొత్తాన్ని నష్టపోయిన రైతులకు వారి అకౌంట్లో జమ చేస్తామని తెలిపారు. ఈ విషయంలో పొగాకు బోర్డు అధికారుల ప్రమేయం ఏమీ ఉండబోదు అని కేవలం మానవతా దృక్పథంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రైతు ప్రతినిధులు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో బాలికకు గాయాలు

టి.నరసాపురం : మండలంలోని వెలగపాడు గ్రామంలో శనివారం విద్యుదాఘాతానికి గురై బాలికకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని నరదల మురళి కుమార్తె కీర్తి (10) డాబాపై ఆడుకుంటుండగా, డాబా సమీపంలోని విద్యుత్ తీగలకు ఆట వస్తువు తగిలింది. దీంతో బాలిక విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలపాలైంది. వెంటనే బాలికను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖాధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా ఇంటి నిర్మాణ సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందనే విషయం కుటుంబానికి తెలిపినట్లు అధికారులు తెలిపారు.

వైభవంగా గంగానమ్మ జాతర



గరగలను తలపై పెట్టుకున్న మహిళలు



గంగానమ్మ పూజ కోసం క్యూలో నిలబడ్డ భక్తులు

బుట్టాయగూడెం : మండలంలోని దొరమామిడిలో గంగానమ్మ, మాయాలమ్మ, ముత్యాలమ్మ, పుంతలో మునలమ్మ, పోతురాజు జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ నెల 1వ తేదీ నుంచి కొనసాగుతున్న ఈ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి గరగలను తలపై పెట్టుకుని అమ్మవార్లకు పూజలు చేశారు. ఈ సందర్భంగా వివిధ వేషధారణలో కళాకారులు నృత్యాలు చేస్తూ అమ్మవారి ఊరేగింపును నిర్వహించారు. జాతరలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సైలు ఎం.జయబాబు, చంద్రశేఖర్‌లతో పాటు 70 మంది సిబ్బంది, 10 మంది ప్రత్యేక పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా ఆదివారం బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సుమారు 60 వేల మందికి పైగా వచ్చే అవకాశం ఉందని సర్పంచ్ తెల్లం రాముడు తెలిపారు. ఈ జాతర మహోత్సవాలను మద్దిపాటి రాము, కాకర్ల చంద్రశేఖర్, పోలిన సుబ్రహ్మణ్యం, కీర్ల శ్రీనివాసరావు, కొమరం సత్యనారాయణ, కాలింగి వెంకటేశ్వరరావు, వడ్లమూడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి శ్రీనివాసరావుతో పాటు పలువురి ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతర సందర్భంగా దొరమామిడిలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

అడ్మిషన్ల కోసం క్యాంపెయినింగ్

కామవరపుకోట: డిగ్రీ అడ్మిషన్ల కోసం శనివారం స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు క్యాంపెయినింగ్ నిర్వహించారు. బుట్టాయిగూడెం మండలం బూసరాజపల్లిలోని గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాల వద్ద, బుట్టాయిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఈ క్యాంపెయినింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ కె.రవీంద్రబాబు మాట్లాడుతూ కామవరపుకోట మండలం ఆడమిల్లి గ్రామంలో ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల అత్యాధునిక వసతులతో నెలకొల్పబడి, బాలురకు, బాలికలకు మౌలిక వసతులతో ప్రత్యేకంగా హాస్టల్ వసతి కల్పించబడిందన్నారు. ఇక్కడ అధ్యాపకులందరూ అంకిత భావంతో పనిచేస్తారని ఇంటర్ ఉత్తీర్ణత పొందిన విద్యార్థులంతా తమ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరారు. ప్రస్తుతం కళాశాలలో అడ్మిషన్ కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ క్యాంపెయిన్‌లో అధ్యాపకులు ఎం.మల్లేశ్వరరావు, వి.శ్రీనివాస్, ధారావతు మల్లేష్, నజ్మా పాల్గొన్నారు.

మద్దిలో హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



మద్ది క్షేత్రంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సింధూరం తొలగింపు అనంతరం స్వామివారి నిజరూప దర్శనం కల్పించారు. యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ, బలిహరములు, అగ్ని ప్రతిష్ఠ, అంకురార్పణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 17వ తేదీ వరకు క్షేత్రంలో హనుమాన్ జయంతి కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయ ధర్మకర్తలు మల్నీడి బాబి, బల్లే నాగలక్ష్మి, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

కొయ్యలగూడెం : హనుమద్ జయంతి పురస్కరించుకుని ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో చేపట్టిన శోభాయాత్ర ఆదివారం ప్రారంభం కానుంది. కన్నాపురంలోని పులిరామన్నగూడెం రోడ్‌లో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి వందలాది మోటారుసైకిళ్లతో గిరిజన, గిరిజనేతరుల భక్త బృందం ఈ యాత్రలో పాల్గొననున్నారు. యాత్ర దిప్పకాయలపాడు మీదుగా కొయ్యలగూడెం గణేష్ సెంటర్‌కి చేరుకుంటుందని ఇదే సమయంలో గోపాలపురం నియోజకవర్గం నుంచి కొన్ని గ్రామాల ప్రజలు మెయిన్ సెంటర్‌కి తరలి వస్తున్నట్లు తెలిపారు. పూజలు నిర్వహించిన అనంతరం సామూహికంగా హనుమాన్ శోభాయాత్రలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు చేరుకొని పూజల అనంతరం జంగారెడ్డిగూడెం ఆంజనేయ స్వామి ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగుతుందని, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

శ్రీవారి క్షేత్రం.. భక్తజన సంద్రం

ద్వారకాతిరుమల: భక్తులు, పెళ్లి జనాలతో శ్రీవారి క్షేత్రం శనివారం కళకళలాడింది. సెలవులు కావడంతో విద్యార్థులు, శుక్రవారం రాత్రి వివిధ ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న జంటలు, వారి బంధువులు వేలాదిగా ఆలయానికి తరలివచ్చారు. తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారి ఉచిత అన్నప్రసాదం కోసం నిత్యాన్నదాన భవనం వద్ద భక్తులు బారులు తీరారు. క్షేత్రంలో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

ఆటలతో చిన్నారులకు మానసిక వికాసం



విద్యార్థులకు క్యారం బోర్డ్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం



లక్కవరం గ్రంథాలయంలో నీతి కథలు నేర్పుతున్న దృశ్యం

కామవరపుకోట : ఆటలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి ఎం.భీమరాజు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులచే పుస్తక పఠనం చేయించి, వారికి నచ్చిన బొమ్మలతో డ్రాయింగ్ గీయించారు. అనంతరం క్యారం బోర్డుపై శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు తప్పనిసరిగా ఆటల్లో పాల్గొవాలని, ఆటలు ఆడటం వలన మానసిక ఉల్లాసం కలిగి విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు, పాఠకులు పాల్గొన్నారు.

నీతి కథల పఠనంతో నైతిక విలువలు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని లక్కవరం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. శనివారం ఉపాధ్యాయుడు కె. నాగేంద్రకుమార్ విద్యార్థులతో తెలుగు నీతి కథలను చదివించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఎం.రియాజ్ మాట్లాడుతూ నీతి కథలు చదవడం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు పెరిగి, మంచి విజ్ఞానం పెంపొందుతుందన్నారు. గ్రంథాలయాలకు విద్యార్థులు ప్రతి రోజు వచ్చి పుస్తక పఠనం చేయాలన్నారు.

ఆరో రోజుకు విజ్ఞాన తరగతులు

కొయ్యలగూడెం : స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శనివారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా విద్యార్థులకు నీతి కథలు, చందమామ బాలమిత్ర కథల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఎంపీపీ స్కూల్ మాస్టారు జి.శేఖర్ చిన్నారులచే నీతికథలు చదవించారు. అలాగే చదరంగం క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. లైబ్రేరియన్ యు.రాముడు, చదువరుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నృత్యాలపై శిక్షణ

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా భరతనాట్యం, ఆధునిక నృత్యంపై నాట్యకారిణి డి.భ్రమరాంబ విద్యార్థులకు శనివారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా పలువురితో నాట్య ప్రదర్శనలు చేయించారు. విద్యార్థులు శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, పాఠకులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతుల నిర్వహణపై పరిశీలన



ప్రత్యేక తరగతులపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏపీఓ

బుట్టాయగూడెం : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులకు మండలంలోని రాజానగరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహణను ఏపీఓ పీవీఎస్ నాయుడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను, పాఠ్యాంశ వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థుల కోసం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు నూతిరామన్నపాలెం, రాజానగరం పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ తరగతుల నిర్వహణ ద్వారా సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ శిరమయ్య, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి ఏటీడబ్ల్యూఓలు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.